క్లుప్తంగా

బీజేపీతోనే ప్రజా సంక్షేమం



ర్యాలీలో అభివాదం చేస్తున్న నవనీత్ రాణా

నారాయణఖేడ్: బీజేపీతో ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని మహారాష్ట్రలోని అమరావతి ఎంపీ అభ్యర్థి నవనీత్ రాణా, జహీరాబాద్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. ఖేడ్ జంట గ్రామం మంగల్‌పేట్‌లో మంగళవారం రాత్రి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగాయత్‌లు, మరాఠాలను ఓబీసీలో చేర్చడం, ఎస్సీల వర్గీకరణ, ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ మళ్లీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉన్నప్పుడే కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదన్నారు. సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల బీజేపీ అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి, అరుణతార, ఖేడ్, జుక్కల్ మాజీ ఎమ్మెల్యేలు విజయపాల్‌రెడ్డి, గంగారాం, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, జహీరాబాద్ పార్లమెంటు పార్టీ ఇన్‌చార్జి రవికుమార్‌గౌడ్, ఖేడ్ అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించండి

పటాన్‌చెరు టౌన్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం నియమించిన ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలను ముమ్మరం చేశాయి. అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట రహదారిపై మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్-2 అధికారి హరిశంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నిబంధనల మేరకే నగదు తీసుకువెళ్లాలని, రూ.50 వేలు మించి నగదు తీసుకెళ్తే నగదును సీజ్ చేస్తామని తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ అసిస్టెంట్ అధికారి సుభాష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ ప్రాధాన్యమిస్తాం

జిన్నారం: కాంగ్రెస్‌లో చేరిన ప్రతిఒక్కరికీ తగిన ప్రాధాన్యత ఇస్తామని మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు అన్నారు. మండల పరిధిలోని కిష్టాయిపల్లి గ్రామానికి చెందిన బీఎస్పీ నాయకుడు సందేగారి ఇంద్రసేన మంగళవారం 50 మంది యువకులతో నీలం మధు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఎంపీగా పోటీ చేస్తున్న తనకు మద్దతు ఇచ్చేందుకు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ గెలిచేలా ప్రజలు తీర్పు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం ఇంద్రసేనాతో పాటు పలువురు యువకులు నీలం మధును ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ జనాభాయి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సదాశివపేటలో పోలీసుల కవాతు

సదాశివపేట(సంగారెడ్డి): ఈ నెల 13న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకునేందుకు పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు మద్దికుంట గ్రామంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మహేష్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు, అన్ని పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు. పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉంది'

కంగ్టి(నారాయణఖేడ్): ఎస్సీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉందని ఆ పార్టీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. కంగ్టి మండలంలోని బసవ ప్రదీప్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ చేసిన అభివృద్ధి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.

బీజేపీలో చేరిక

ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ సమక్షంలో బీఆర్‌ఎస్‌కు చెందిన తాజా మాజీ ప్రజాప్రతినిధులు బీజేపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయ్‌పాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మృతిపై ఎస్పీ రూపేష్ సంతాపం

సంగారెడ్డి: ఉమ్మడి మెదక్ జిల్లాలో పోలీసు కానిస్టేబుల్ విధులు నిర్వర్తిస్తున్న యాదగిరి అకాల మరణానికి జిల్లా ఎస్పీ రూపేష్ మంగళవారం సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యాదగిరి 2013లో జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ నందు పోలీసు కానిస్టేబుల్‌గా నియామకమై ఉమ్మడి మెదక్ జిల్లాలో సేవలందించారన్నారు. అనారోగ్యం కారణంగా చికిత్స పొందుతూ మరణించాడు. పోలీస్ శాఖకు తీరని లోటన్నారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. తక్షణ సహాయంగా రూ.20,000 ఆర్థికసాయం అందజేశారు.

బస్సులు రావు.. బాధలు తీరవు



పల్లెలకు వెళ్లేందుకు ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

ఒకప్పుడు పల్లెలకు బస్సు సర్వీసులు ఉండగా దూర ప్రాంతాలకు తక్కువ బస్సులు నడిచేవి. ప్రస్తుతం అంతరాష్ట్ర రహదారులపై బస్సులు పరుగులు పెడుతుండగా గ్రామాలకు బస్సు సౌకర్యం లేక పల్లె ప్రాంత ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సులు రాకపోవడంతో పల్లెవాసులకు ఇబ్బందులు తప్పడంలేదు. కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి. మరికొందరు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. గ్రామాలు, తండాలకు బస్సు సౌకర్యం కల్పించాలని పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని స్థానిక ప్రజలు వాపోతున్నారు. – జహీరాబాద్ టౌన్

- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలు
- రోడ్లు బాగున్నా పల్లెలకు రాని ఆర్టీసీ బస్సులు
- నైట్‌హోల్ట్ సర్వీసుల రద్దుతో ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

జహీరాబాద్ పట్టణంలో ఆర్టీసీ డిపో ఉండగా గతంలో ఇక్కడి నుంచి నియోజకవర్గంలోని జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్ మండలాలతో పాటు అందోల్ నియోజకవర్గంలోని రాయికోడ్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం ఉండేది. అప్పట్లో ప్రజలు ఆర్టీసీ బస్సులపై ఆధారపడి రాకపోకలు సాగించేవారు. రాను రాను నియోజకవర్గంలోని అధికశాతం గ్రామాలకు బస్సు సర్వీసులు లేకుండాపోయాయి.

ప్రైవేట్ వాహనాలే దిక్కు

ప్రతిరోజు పదుల సంఖ్యలో ప్రజలు పనుల కోసం జహీరాబాద్‌కు వస్తుంటారు. కానీ.. బస్సులు లేకపోవడంతో గత్యంతరం లేక ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని విట్టునాయక్ తండా, కాకిజనవాడ, వడ్డీ, గౌసాబాద్ తదితర గ్రామాలకు నైట్‌ఆల్ట్ సర్వీసులు ఉండేవి. నైట్ ఆల్ట్ సర్వీసులను రద్దు చేయగా ప్రస్తుతం ఆయా గ్రామాలకు పగటిపూట సైతం బస్సులు రావడం లేదు.

తరచూ రోడ్డు ప్రమాదాలు

మొగుడంపల్లి మండలంలో 20 వరకు గ్రామపంచాయతీలు ఉంటాయి. ఇందులో తండాలు అధికంగా ఉంటాయి. అయితే ఏ ఒక్క పంచాయతీ పరిధిలో బస్సు సౌకర్యం లేదు. దీంతో



చించోళి- జహీరాబాద్ రూట్ మధ్య నడుపుతున్న కర్నాటక బస్సు

చేసేదేమీలేక ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించడం ద్వారా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రోడ్డు సౌకర్యం ఉన్న గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కర్నాటక బస్సులే దిక్కు



మొగుడంపల్లి మండలానికి జహీరాబాద్ డిపో నుంచి బస్సు సౌకర్యం కల్పించడంలేదు. చిన్న పనికోసం గ్రామాల ప్రజలు జహీరాబాద్ టౌన్‌కు వెళ్లాల్సి వస్తోంది. గత్యంతరం లేక ఆటోలో ప్రయాణిస్తున్నాం. కర్నాటక రాష్ట్ర ఆర్టీసీ అధికారులను వివరణ కోరగా చించోళి నుంచి జహీరాబాద్‌కు నాలుగైదు ట్రిప్పు బస్సులను నడుపుతున్నారు. కర్నాటక బస్సే దిక్కుఅయింది.

–మహేష్, స్థానికుడు

సరిపడా బస్సులు లేవు

జహీరాబాద్ డిపోలో సరిపడా బస్సులు లేవు. అందుకని చాలా గ్రామాలకు సరిపోను బస్సులు నడపడంలేదు. పాఠశాల వేళల్లో విద్యార్థుల సమయానుకూలంగా పల్లెలకు బస్సులు నడిపిస్తున్నాం. కొత్త బస్సులు వస్తే సమస్య కొంత వరకు తీరుతుంది.

– సత్యనారాయణ, డిపో మేనేజర్

జహీరాబాద్‌ను అభివృద్ధి చేస్తాం



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపిస్తే ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో జహీరాబాద్ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ మున్సిపల్ పరిధిలోని నాగులకట్ట, మాణిక్‌ప్రభు వీధి తదితర ప్రాంతాల్లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి గెలిపిస్తే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలవుతాయన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, నియోజకవర్గం ఇన్‌చార్జి దేవిప్రసాద్, నాయకులు షేక్ ఫరీద్, బరూర్ దత్తాత్రి, ముత్యాల చందు, యాకూబ్, నామరవికిరణ్ గుప్తా, అబ్దుల్లా, తులసిదాస్ గుప్తా పాల్గొన్నారు.

ఖేడ్‌లో ఇంటింటి ప్రచారం

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తరఫున మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అహీర్ పరశురాం, నాయకులు అభిషేక్ షెట్కార్, విఠల్, ఉబేద్, గోపాల్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఇంటింటి ప్రచారం ముమ్మరం

మునిపల్లి(అందోల్): బీఆర్‌ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్ ఆధ్వర్యంలో బొడపల్లి, చిన్నచల్మెడ, తక్కడపల్లి, మేళసంగ్యం, లింగంపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్, శివశంకర్, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డిని గెలిపించండి

జిన్నారం: మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా మంగళవారం బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. అదేవిధంగా మంగంపేటలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ వెంకటేశంగౌడ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెలిగిరిపేట్ గ్రామంలో...

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని మెలిగిరిపేట్ గ్రామంలో మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఎంపీపీ తొంట యాదమ్మ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంజన్న, మాజీ సర్పంచులు హనుమంత్‌రెడ్డి, సంగమేశ్వర్, నవీన్, కుమార్, ఆరిఫొద్దీన్, నాయకులు రమేష్, సర్వేశ్వర్, మక్సూద్ తదితరులు పాల్గొన్నారు.



ఓటరుతో మాట్లాడుతున్న నాయకులు

ముస్లింలకు పెద్దన్న కేసీఆర్

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల ఆర్థిక అభ్యున్నతికి పెద్దపీట వేసిన మహోన్నత వ్యక్తి మాజీ సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన ఈద్ మిలాప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన ముస్లింలను గత 10 ఏళ్ల కాలంలో ఎంతో ప్రాధాన్యమిచ్చిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. గంగ జమున తహజీబ్ సంస్కృతికి పెద్దపీట వేయడంతో పాటు మతసామరస్యం పెంపొందించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలను ఓటు బ్యాంకుగా మార్చుకుంటోందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లు తొలగించి రాజ్యాంగాన్ని సవరించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వ్యక్తిత్వ వికాసా నిపుణులు, ముస్లిం మత ప్రబోధకులు సిరాజ్ ఉర్ రెహమాన్, అల్లమా అహ్మద్ మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గంలో కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను ఒక్కతాటిపై నిలిపి వారి అభివృద్ధికి కృషి చేస్తున్న గొప్ప నాయకుడు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అని కొనియాడారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ముస్లిం మతపెద్దలు, మైనార్టీలు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ మెడలు వంచాలి

పటాన్‌చెరు టౌన్: దేశ ఆర్థిక రంగానికి వెన్నుముకగా నిలుస్తున్న కార్మిక రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మెడలు వంచాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వివిధ కార్మిక సంఘాల మీడియా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను ఆమోదిస్తూ పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తోందని ధ్వజమెత్తారు. కార్మికులను రోబోల మాదిరిగా పని చేయిస్తూ కార్మిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మెడలు వంచాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, వివిధ కార్మిక సంఘాల నాయకులు ఈశ్వర్ ప్రసాద్, నర్ర భిక్షపతి, మాధవరావు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లతో ఒరిగిందేమీలేదు

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్

జహీరాబాద్: పదేళ్ల కాలంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్‌లతో పేదలకు ఒరిగిందేమీ లేదని కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ ఎద్దేవా చేశారు. మొగుడంపల్లి మండల కేంద్రంలోని ఆజాద్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌షెట్కార్ మాట్లాడుతూ బీజేపీ ప్రజల మధ్య అంతరాలను పెంచితే కాంగ్రెస్ పార్టీ అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తోందన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, ఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మక్సూద్, గుండ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కుతుబుద్దీన్, మల్లికార్జున్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, కిషన్ పవార్, ఎంజీ రాములు, అశోక్, హన్మంత్‌రావుపాటిల్, గోపాల్, ముబీన్, అర్షద్ పటేల్, వెంకట్‌రెడ్డి, బక్కయ్య, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం

నారాయణఖేడ్: రాబోయే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ రెడ్డి పిలుపునిచ్చారు. మనూరు మండల పరిధిలోని రాయిపల్లి, ఉసిరికపల్లి, దన్వార్, ఇస్లాంపూర్, రాణాపూర్, మాయికోడ్, తుమ్నూర్, ముగ్దుంపూర్, దుదగొండ, ఫత్‌లింగంపల్లి, మనూరు, బెల్లాపూర్, పుల్‌కుర్తి, బాదల్‌గాం, దోసల్లి, డోవూరు, ఎల్గొయి, అతిమ్యాల్, ఎస్‌జీ హుక్రాన, తోర్నాల్ గ్రామాల్లో మంగళవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్‌షెట్కార్‌తో కలిసి ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సురేష్‌షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం

మునిపల్లి(అందోల్): కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని మాజీ ఎంపీపీ రాంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పొల్కంపల్లి, బేల్లూర్, చీలపల్లి, పెద్దలోడి, పిల్లోడి గ్రామాల్లో జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్‌ను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.తాజా మాజీ ప్రజాప్రతినిధులు సతీష్‌కుమార్, వీరన్న పటేల్, వెంకట్‌రాములు, విఠల్‌రెడ్డి, శివచంద్రకుమార్ పాటీల్, ఖమ్మంపల్లి ఎంపీటీసీ శివనీల మల్లన్న, పొల్కంపల్లి సర్పంచ్ నాగమణి, ఖమ్మంపల్లి సర్పంచ్ జాస్మిన్ గుండు పటేల్, సదాశివుడు, మల్లన్న, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నీలం మధుకు మద్దతుగా ప్రచారం



సదాశివపేట పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

జిన్నారం: మెదక్ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న నీలం మధును గెలిపించాలని బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీల్లో నీలం మధుకు మద్దతుగా మంగళవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు

భారతినగర్ డివిజన్ పరిధిలో...

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని ఆయా కాలనీలలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట పట్టణంలో...

సదాశివపేట(సంగారెడ్డి): మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా సదాశివపేట పట్టణంలోని ఒకటో వార్డులో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ పిల్లోడి విశ్వనాథం ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, మార్కెట్ వైస్‌చైర్మన్ కంది కృష్ణ, మామిడిరాజు, రామన్న, లక్ష్మణ్, శ్రీను, రాజు, సతీష్, చందు, హాజీ, హఫీస్, రాజు, వెంకట్ పాల్గొన్నారు.

నీలం మధుకు మద్దతుగా ప్రచారం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని అంకేనపల్లి, కోనాపూర్, ఇబ్రహీంబాద్ గ్రామాల్లో మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పృథ్వీరాజ్, రవీందర్, శివకుమార్, అబిద్, దశరథ్, కోనాపూర్ బక్కప్ప, బలరాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని కొన్యాల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ ఎంపీటీసీ విఠల్‌రెడ్డి తన అనుచరులతో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా షేర్ఖాన్‌పల్లి మాజీ సర్పంచ్, పలుకు పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సుదర్శన్‌గౌడ్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా కాంగ్రెస్‌లో చేరారు. పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజురెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మండల అధ్యక్షుడు కృష్ణ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, అజీజ్, మణిదీప్, సాయి, రాజీవ్‌గాంధీ, నగేష్‌గౌడ్ పాల్గొన్నారు.

న్యాల్‌కల్ మండల పరిధిలో...

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని అత్నూర్, న్యాల్‌కల్ తదితర గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేశారు. ఈ సందర్భంగా జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ పార్టీలో చేరినవారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు గౌసోద్దీన్, చంద్రప్ప, గిరీష్‌రావు, రఫీయోద్దీన్ పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

ఝరాసంగం(జహీరాబాద్): బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిలింగ్ సభ్యులు అనితపాటిల్ పేర్కొన్నారు. ఝరాసంగంలో జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ తరఫున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రజినిప్రియ పాటిల్, విజయేందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మంజుల కొలాస్, నాయకులు ఎంపీ సంతోష్ పాటిల్, సంగమేశ్వర్, శివ, శ్రీనివాస్, శ్రవణ్, నాగరాజు పాల్గొన్నారు.

జిన్నారం మండలంలో...

జిన్నారం: మండల పరిధిలోని అండూర్, సోలక్పల్లి, శివానగర్, కిష్టాయిపల్లి, కాజిపల్లి గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ ఓట్లను అభ్యర్థించారు. ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

వట్‌పల్లి(అందోల్): సమస్యల పరిష్కారం కోసం మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్లక్ష్యం చేస్తూ మెజార్టీ సంఖ్యలో ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. ఎంపీపీ కృష్ణవేణి అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో మొత్తం 9 మంది ఎంపీటీసీలు ఉండగా మధ్యాహ్నం ఒంటిగంట అవుతున్నా సమావేశానికి ఇద్దరు ఎంపీటీసీలే రావడంతో కోరం లేక సమావేశం ప్రారంభించలేదు. దీంతో పలుమార్లు ఫోన్ చేసినా ఎవరూ సమావేశానికి రాలేదు. చివరికి పోతులబొగడా ఎంపీటీసీ నాగరాజుకు మరోమారు ఫోన్ చేయగా హాజరయ్యాడు. కాగా రెండు గంటల ఆలస్యంగా సమావేశాన్ని ప్రారంభించారు. అతను కూడా సంతకం చేసి వెళ్లిపోయాడు. పార్లమెంటు ఎన్నికల విధుల సాకుతో అధికారులు కూడా అంతంత మాత్రంగానే హాజరుకావడంతో అరగంటలోనే సమావేశం ముగించారు. అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివేటప్పుడు వినేవారు లేక సభ వెలవెలబోయింది. సమావేశంలో జెడ్పీటీసీ అపర్ణ, ఎంఈఓ యూసుఫ్, తహసీల్దారు శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



రామచంద్రాపురం: భారతినగర్ డివిజన్‌లో కూలిన చెట్టు



హత్నూరలో కూలిపోయిన టిఫిన్ సెంటర్

అకాల వర్షం.. తీరని నష్టం

జిల్లావ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో మంగళవారం కురిసిన వర్షానికి ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. పలుచోట్ల చెట్లు నేల కూలగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.